بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

**Summary of Friday Sermon Hadzrat Khalifatul Masih V 10.01.2020 (Telugu)**

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప అనుచరులైన హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ సద్గుణముల విశ్వాసభరిత ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 10.03.2020 తేదీన - మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనా నంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. గత ఖుత్బాలో నేను వఖ్ఫె జదీద్ నూతన సంవత్సర ప్రకటనలో భాగంగా దేశముల స్థానములను తెలుపుతు ఇంగ్లాండ్‌లోని జమాఅత్‌లలో వఖ్ఫె జదీద్ చందా వసూలులో ఇస్లామాబాద్ మొదటి స్థానములో నిలిచెనని నేను తెలిపితిని. కాని తర్వాత తెలిసినదేమనగా ఆ సమీక్షలో తప్పు దొర్లినది. మొదటి స్థానములో ఓల్డర్ షా జమాఅత్ నిలువగా ద్వితీయ స్థానములో ఇస్లామాద్ నిలిచినది. ఈ విషయమును సరి దిద్దవలసి యుండెను. అందుకే నేను మొదట ఈ విషయమును ప్రస్తావించాను. ఓల్డర్ షా జమాఅత్ అల్లాహ్ తఆలా కృపానుసారము పెద్ద పెద్ద త్యాగములు సమర్పిస్తున్నది. ప్రత్యేకంగా కొందరు స్త్రీలు ఎలా త్యాగములు సమర్పిస్తున్నారో అనే విషయమును నాకు సదర్ లజ్న ఓల్డర్ షా తెలిపారు. నిజముగనే వారి త్యాగ స్ఫూర్తి ఆదర్శవంతముగా వున్నది. అల్లాహ్ తఆలా వారి ధనము, కుటుంబములో శుభములు కలిగించుగాక! ధనికులు కూడ ఆలోచించుటకు, వారు కూడ ఈ త్యాగ స్ఫూర్తిని అర్థము చేసుకొనుటకు నేను గత ఖుత్బాలో అధికంగా పేద దేశముల, పేద దేశస్తుల త్యాగముల సంఘటనలను ప్రస్తావించాను. వాస్తవానికి అల్లాహ్ తఆలా కృపానుసారము ఈ అభివృద్ధి చెందిన దేశముల లో సైతం చాలా మంది తమ ప్రాపంచిక అవసరములను విస్మరించి త్యాగములు చేస్తున్నారు.

ఇప్పుడు నేను నేటి ఖుత్బా అంశమును ప్రస్తావింతును. గత ఖుత్బా కంటే ముందటి ఖుత్బాలో హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ ప్రస్తావన జరుగుచుండెను. వారి కొన్ని విషయములు మిగిలి యుండెను. నేడు కూడ వారి విషయములనే ప్రస్తావింతును. కాని ఇచట కూడ ఒక సవరణ చేయవలసి వున్నది. కావున ఆ సవరణను నేను మొదట ప్రస్తావింతును. తర్వాత మిగతా విషయము లు తెలుపుతాను.

27 డిసంబర్ ఖుత్బాలో హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ పరిచయములో ఇట్లు చెప్పబడెను. హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ మరియు మక్కా నుండి వలస వచ్చిన హజ్రత్ అబూజర్ ఘఫ్ఫారి మధ్య ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సోదర భావము నెలకొల్పిరి. ఇబ్నె ఇస్‌హాఖ్ ప్రకారము హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ మరియు హజ్రత్ అబూజర్ ఘఫ్ఫారి మధ్య ఆంహుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సోదర భావము ఏర్పరచిరి. కాని కొందరు ఈ విషయములో విభేదము తెలుపుతారు. ఏది ఏమైనప్పటికి ఇదిలా లేదు. సోదరభావము గురించి ఈ ప్రస్తావన హజ్రత్ ముంజిర్ బిన్ అమర్ బిన్ హునైస్ గురించి యుండెను. ఏ పుస్తకము నుండి ఈ విషయము సేకరించబడెనో అక్కడ వారితో పాటు హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ ప్రస్తావన కూడ యుండెను. రిసర్చ్ సెల్ తరపున పొరపాటుగా ఈ విషయము హజ్రత్ సాద్‌తో కలిపి పంపబడెను. వాస్తవానికి ఈ సోదర భావన ప్రస్తావన హజ్రత్ ముంజిర్ బిన్ అమర్‌నకు చెందినది. ఈ విషయమును నేను గత సంవత్సరం 25 జనవరి ఖుత్బాలో వివరంగా ప్రస్తావించి వుంటిని. ఈ విషయము ను కూడ సవరించ వలసి యుండెను. ఇప్పుడు తర్వాతి విషయములను ప్రస్తావిస్తున్నాను.

ఖందక్ సంఘటన సంభవించినప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఘత్ఫాన్ ప్రజలను తిరిగి తీసుకొని పోయినచో అయినా బిన్ హిస్న్‌నకు మదీనాలోని మూడవ భాగము ఖర్జూరములు ఇచ్చుటకు ప్రతిపాదన చేయుట గురించి ఆలోచిస్తుండిరి. ఇతరులను పిలువ కుండా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ సాద్ బిన్ మఆజ్, హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్‌ను పిలిచి సలహా అడిగిరి. దీని వివరణ ఖందక్ యుద్ధ సంఘటనలలో భాగంగా హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారిట్లు వ్రాసిరి.

ఈ రోజులు ముస్లిముల కొరకు చాలా కష్టతరమైనవి, ఇబ్బందికరంగా, ప్రమాదముతో కూడినవై వుండెను. చుట్టుముట్టి రోజులు గడుస్తున్న కొద్ది ముస్లిము ల శక్తి బలహీన పడుతుండెను. వారి హృదయములు విశ్వాసము, విధేయతతో నిండి వుండెను. కాని శరీరము ప్రాపంచిక చట్టము ప్రకారము నడుచును. రణరంగము

లో చాలా రోజులు గడుపుతున్నందున విశ్రాంతి లేకుండెను. సరియైన మోతాదులో ఆహారము కూడ లభించడం లేకుండెను. కావున అలసట కలుగు తుండెను. తద్వారా శరీరము సహజంగానే శక్తిహీనతకు గురగుతుండెను. కావున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ పరిస్థితులను గమనిస్తు అన్సార్ నాయకులు హజ్రత్ సాద్ బిన్ మఆజ్, సాద్ బిన్ ఉబాదహ్‌ను పిలిపించుకొని వారికి పరిస్థితులను వివరించి ఇప్పుడు మనము చేయవలసినదేమిటి అని వారిని సలహా అడిగిరి. మీరు కోరినచో మదీనా ఆదాయములోని కొంత భాగము ఘత్ఫాన్ తెగకు సమర్పించి ఈ యుద్ధమును ముగించవచ్చును. అప్పుడు సాద్ బిన్ మఆజ్, సాద్ బిన్ ఉబాదహ్ ఇద్దరు ముక్త కంఠముతో ఇట్లనిరి. ఓ దైవ ప్రవక్తా! ఈ విషయము గురించి మీకు ఆకాశవాణి అందినచో మేము అంగీకరిస్తాము. మీరు ఆనందముతో ఈ ప్రతిపాదనను ఆచరించండి. బదులుగా వారు సల్లం ఇట్లనిరి. దీని గురించి నాకు ఎలాంటి దివ్యవాణి అంద లేదు. మీ బాధల వలన నేను మీతో సలహా అడుగు తున్నాను. అటులైనచో మా సమాధానమేమనగా మేము అన్యారాధకులుగా వున్నప్పుడు ఏమియును ఇవ్వనిచో ఇప్పుడు ముస్లిములమై ఎలా ఇవ్వగలము. వారికి మేము ఖడ్గ మొన తప్ప ఏమియును ఇవ్వలేము. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అన్సార్ వల్లనే చింత కలుగుతుండెను. ఎందుకనగా వీరే మదీనా నిజమైన నివాసకులు. అన్సార్ ఈ పరిస్థితుల వలన ఇబ్బందులకు గురగుచున్నారా? అని తెలుసు కొనుటకే వారు సల్లం ఈ సలహా సేకరించి యుండవచ్చును. ఒక వేళ వారు ఇబ్బంది పడుచున్నచో వారి స్థైర్యమును పెంచుటకు తగిన ఏర్పాట్లు చేయవచ్చును. కావున వారు సల్లం పూర్తి ఆనందరముతో వారి సలహాను స్వీకరించిరి, అనంతరం యుద్ధమును కొనసాగించిరి.

ఖందక్ యుద్ధము సందర్భమున అబూసుఫ్యాన్ ఒక ఎత్తుగడ వేసెను. యూదులైన బనూ నజీర్ నాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్‌ను రాత్రి చీకటిలో బనూ ఖురైజ కోట వైపు వచ్చి, వారి నాయకుడు కాబ్ బిన్ అసద్‌తో కలిసి బనూఖురైజను తనతో కలుపుకొనుటకు ప్రతయ్నించవలెనని సూచించెను. కావున అవకాశము రాగానే హుయ్యి బిన్ అఖ్తబ్ కాబ్ బిన్ అసద్ ఇంటికి చేరుకొనెను. మొదట్లో కాబ్ అతని మాట వినుటకు నిరాకరిస్తు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తో మేము ఒప్పందము కుదుర్చుకున్నాము. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎల్లప్పుడు మాతో చేసిన ఒప్పందమును అతి వశ్వసనీయతతో పాటించారు, కావున నేను వారిని మోసము చేయలేనని అనెను. కాని హుయ్యి బిన్ అఖ్తబ్ అతనికి ఉజ్వల భవిష్యత్తును చూపించి, ఇస్లాం త్వరలోనే నాశనమగునని నమ్మకము కలిగించెను. కావున తుదకు అతడు రాజీ పడెను. బనూ ఖురైజ మోసము గురించి వారి (సల్లం)కి తెలియగా రెండు మూడు సార్లు రహస్యముగా జుబైర్ బనిల్ అవ్వామ్ రజియల్లాహు అన్‌హును పరిస్థితులు తెలుసుకొనుటకు పంపిరి. అనంతరం అధికారికంగా ఔస్, ఖజ్రజ్ నాయకులు సాద్ బిన్ మఆజ్, సాద్ బిన్ ఉబాదహ్‌ను, ఇంకొందరు ఇతర నాయకులను ఒక బృందము రూపంలో పంపిరి. వీరు బనూ ఖురైజ గృహములకు చేరుకున్నప్పుడు వారి నాయకుడు కాబ్ బిన్ అసద్ వద్దకు వెళ్ళిరి. ఆ దుష్టుడు వారితో అతి గర్వముగా మాట్లాడెను. అతని తెగ వ్యక్తులు ఇట్లనిరి. వెళ్ళండి! మాకు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మధ్య ఎలాంటి ఒప్పందము లేదు. ఈ పదములు విని అనుచరుల బృందము అక్కడి నుండి లేచి వచ్చెను. సాద్ బిన్ మఆజ్, సాద్ బిన్ ఉబాదహ్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి పరిస్థితులను వివరించిరి.

బనూ ఖురైజ యుద్ధము సందర్భమున హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ ఎన్నో ఒంటెలపై ఖర్జూరములు మోసుకొని వచ్చి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, ముస్లిములకు అందించిరి. వారందరికి ఇదే ఆహారముగా ఉపయోగపడుతుండెను. అప్పుడు ఖర్జూరము ఎంత చక్కటి ఆహారమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనిరి.

మక్కా విజయము సందర్భమున సైన్యము మక్కాకు వెళుతుండెను. రహదారి అంచున అబూ సుఫ్యాన్, అతని సహచరులను తీసుకొని నిలబడమని హజ్రత్ అబ్బాస్‌ను రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. తద్వారా అతడు ఇస్లామీయ సైన్యము, దాని వీరోచితమును చూడవచ్చును. ఒక్కొక్క సైన్యము వెళు తుండెను. ఇంతలోనే అన్సార్ తెగ సైన్యము వెళ్ళెను. ఇస్లాం ప్రేమ, అందుకు త్యాగమగుటకు ఉత్సాహము వారి ముఖముల నుండి కనిపిస్తుండెను. అబ్బాస్! వీరెవరని అబూసుఫ్యాన్ అడిగెను. అన్సార్ తెగ అని వారు బదులిచ్చిరి. అబూ సుఫ్యాన్ ఆశ్చర్యముతో అబ్బాస్ ముఖము చూసి మొత్తం అరబ్‌లో అందరి కంటే ఎక్కువ వీరే ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు శత్రువులుగా యుండిరని అనెను. ఇది అల్లాహ్ తఆలా అనుగ్రహము. అతడు కోరినప్పుడు వీరి హృదయములో ఇస్లాం ప్రేమ ప్రవేశించినది. చివరగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, ముహాజిర్లు,

అన్సార్‌ల సైన్యము వెళ్ళి నది. వీరు రెండు వేల సంఖ్యలో వుండిరి. తల నుండి పాదముల వరకు రక్షణ కవచములో మునిగి వుండిరి. హజ్రత్ ఉమర్ రజి వారి వరుసలను చక్కదిద్దుతు ఇట్లను చుండిరి. జాగ్రత్తగా అడుగులు వేయండి. పాదముల దూరము సమానంగా వుండ వలెను. ఈ ప్రాచీన విశ్వసనీయుల ఇస్లాం పట్ల ఉత్సాహము, వారి సంకల్పము, వారి ఉద్రేకము వారి ముఖముల నుండి వెలువడు చుండెను. అబూ సుఫ్యాన్ వీరిని చూడగానే హతాశుడయ్యెను. అతడిట్లనెను. అబ్బాస్! వీరెవరు? ముహాజిర్లు, అన్సార్‌ల సైన్యములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెళ్ళుచున్నారని అబ్బాస్ బదులిచ్చెను. ఈ సైన్యమును ఎదురించు శక్తి ప్రపంచములో ఎవరికి వున్నదని అబూసుఫ్యాన్ అనెను. అనంతరం అతడు హజ్రత్ అబ్బాస్‌తో ఇట్లనెను. నీ సోదరుని కుమారుడు నేడు ప్రపంచములో అందరి కంటే పెద్ద రాజు అయినాడని అబూసుఫ్యాన్ అనెను. ఇప్పటికి నీ హృదయ ద్వారములు తెరుచు కోలేదా? ఇది రాజరికము కాదు, ప్రవక్తృత్వము అని అబ్బాస్ అనిరి. సరే సరే ప్రవక్తృత్వమే అని అబూసుఫ్యాన్ అనెను. ఈ సైన్యము అబూ సుఫ్యాన్ ముందటి నుండి వెళుతున్నప్పుడు అబూ సుఫ్యాన్‌ను హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ చూసి నేడు ఖడ్గ బలముతో మక్కాలో ప్రవేశించుట ధర్మబద్ధమైనదని, ఖురైష్ జాతి నేడు కించపర చబడునని అనిరి. అబూ సుఫ్యాన్ ముందటి నుండి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వెళుతున్నప్పుడు అతడు గట్టిగా ఇట్లు అడిగెను. ఓ దైవ ప్రవక్తా! మీరు మీ జాతిని హతమార్చుటకు అనుమతించారా? ఇప్పుడిప్పుడే అన్సార్ నాయకుడు సాద్, అతని సహచరులు ఇట్లనుచుండిరి. నేడు యుద్ధము సంభవించును. మక్కా పవిత్రత నేడు మమ్ములను యుద్ధము నుండి నివారించలేదు. ఖురైష్‌ను మేము కించపరుస్తాము. ఓ దైవ ప్రవక్తా! మీరు ప్రపంచములో అందరికంటే అధిక పుణ్యాత్ములు, అధిక దయామయులు, అత్యంత ఎక్కువగా బంధుత్వమును సలుపువారు. నేడు మీరు మీ జాతి హింసలను మరచి పోరా? అబూసుఫ్యాన్ ఈ ఫిర్యాదు, విన్నపమును విని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అబూసుఫ్యాన్! సాద్ చెప్పినది తప్పు. నేడు కరుణామయ దినము. నేడు అల్లాహ్ తఆలా ఖురైష్‌నకు, ఖానా కాబాకు గౌరవము ప్రసాదించును. అనంతరం వారొక వ్యక్తిని సాద్ వద్దకు పంపి ఇట్లు ఆదేశించిరి. తమ జెండా తమ కుమారుడైన ఖైస్‌కు ఇచ్చివేయుము. అతడు నీ బదులు అన్సార్ బృందమునకు నాయకత్వము వహించును. ఇలా వారు మక్కా వారిని కూడ సంతోషపరచిరి. అన్సార్ హృదయములకు కూడ గాయము తగలకుండా చూచిరి. ఖైస్ మీద రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అపార నమ్మకముండెను. ఎందుకనగా వారు అతి బుద్ధిమంతులు, మంచి స్వభావికులైన నవయువకులు.

హునైన్ యుద్ధము హిజ్రి 8వ సం॥ షవ్వాల్‌లో మక్కా విజయము తర్వాత జరిగెను. ఆ యుద్ధములో లభించిన శత్రు సామాగ్రిని నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ముహాజిర్లలో పంచి పెట్టిరి. అన్సార్ హృదయములలో ఈ విషయము తట్టు కొనెను. హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లనిరి. ఓ దైవ ప్రవక్తా! ఈ తెగ వ్యక్తులు అనగా అన్సార్ తమ హృదయములలో మీ గురించి కొంత భావిస్తున్నారు. తమ జాతిని ఈ ప్రాంతములో సమావేశ పరచుమని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిరి. అందరు గుమికూడగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి వద్దకు వచ్చిరి. అల్లాహ్ తఆలాను కీర్తించిన తర్వాత వారిట్లనిరి. ఓ అన్సార్ తెగస్తులారా మీకు ధనము లభించలేదని మీకు కొంత మేరకు అసంతృప్తి కలిగినట్లు నాకు వార్తలందినవి. ప్రాపంచిక అల్పమైన ధనము గురించి మీరు దుఃఖమునకు గురైనారా! ఓ అన్సార్ తెగస్తులారా! ప్రజలు మేకలు, గొర్లు, ఒంటెలను తీసుకొని పోగా మీరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను తీసుకొని మీ ఇంటికి పోవుతున్నందుకు మీకు ఆనందం కలగడం లేదా! అనంతరం ఇంకా వారిట్లనిరి. ఎవరి హస్తములో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రాణమున్నదో అతని ప్రమాణముగా తెలుపుచున్నాను. వలస లేకున్నచో నేను అన్సార్‌లలోని ఒకనిగా వుండేవాడిని. ఓ అల్లాహ్! అన్సార్‌ను కరుణించుము. అన్సార్ కుమారులను, అన్సార్ కుమారుల కుమారులను కరుణించుము. కథకులు ఇట్లు తెలిపిరి. అప్పుడు అన్సార్ అందరు రోధించడం మొదలు పెట్టిరి. ఎంతగా అనగా వారి గడ్డములు కన్నీటితో తడిసిపోయెను. మీరు ఎలా పంచి పెట్టారో దాని పట్ల సంతోషంగా వున్నాము. మీరు మాకు సరిపోవుదురు అని తెలిపిరి.

హజ్జతుల్ విదా కొరకు మదీనా నుండి ప్రయాణము చేసి నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం హజ్ ప్రదేశమునకు చేరుకున్నప్పుడు అక్కడ వారి పశువు తప్పి పోయెను. హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్‌కు ఈ విషయము తెలియగా తమ కుమారుడైన ఖైస్‌తో కలిసి వచ్చిరి. వారిద్దరి వెంట ఒక ఒంటె వుండెను. దానిపై ప్రయాణమునకు సద్ది వుండెను. వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లు వేడుకొనిరి.

ఓ దైవ ప్రవక్తా! సామాగ్రితో వున్న మీ ఒంటె తప్పిపోయి నదని మాకు తెలిసినది. దానికి మా ఈ పశువును తీసుకోండి. బదులుగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా ఆ పశువును మా వద్దకు తీసుకొచ్చెను. అనగా తప్పిపోయినది దొరికినది. మీరిరువురు మీ పశువును తిరిగి తీసుకెళ్ళండి. మీరిద్దరికి అల్లాహ్ తఆలా శుభములు కలిగించుగాక!

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజియల్లాహు అన్‌హుమా ఇట్లు తెలిపిరి. హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ ఒకసారి వ్యాధికి గురైరి. వారిని పరామర్శించుటకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ అందరు కలిసి వెళ్ళిరి. వారక్కడికి వెళ్ళినప్పుడు వారి కుటుంబీకుల గుంపును చూచి, వీరు మృతి చెందారా? అని అడిగిరి. ఇంకా మృతి చెందలేదని వారు బదులిచ్చిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం దగ్గరికి వచ్చి వారి పరిస్థితిని చూసి దుఃఖించిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను ఏడుస్తుండగా చూసి ప్రజలు కూడ ఏడ్వడం మొదలు పెట్టిరి. అనంతరం వారిట్లనిరి. వినండి. చూడండి. కన్నీరు ప్రవహించడంతో అల్లాహ్ శిక్షించడు. తమ నాలుకను చూపిస్తు మృతునిని, అతని కుటుంబ సభ్యులను గట్టిగా మృతుని లక్షణములను తెలుపుతు ఏడ్వడం వలన శిక్షించును. ఎందుకనగా అలా బహిరంగంగా ఏడ్వడం తప్పు.

నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నట్లు హజ్రత్ అబూ ఉసైద్ తెలిపిరి. అన్సార్ కటుంబములలో ఉత్తమమైన కుటుంబము బనూనజ్జార్, అనంతరం బనూ అబ్దెఅష్‌హల్, అనంతరం బనూహారిస్ బిన్ ఖజ్రజ్, అనంతరం బనూ సాయిదహ్, అనంతరం అందరు. ఇది విని హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ ఇట్లనిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికి మన పై ప్రాధాన్యనతిచ్చిరి. మీకు కూడ చాలా మందిపై ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రాధాన్యతనిచ్చిరని ప్రజలు తెలిపిరి.

హషామ్ బిన్ ఉర్వ తమ తండ్రితో ఇట్లు తెలిపిరి. హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ ఇట్లు దుఆ చేసేవారు. ఓ అల్లాహ్! నన్ను ప్రశంసకర్తునిగా చేయుము, నాకు వైభవము, గొప్పతనము ప్రసాదించుము.

ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ హదీసులో ఒక కథనమిట్లు గలదు. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వారితో ఇట్లనిరని హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ ఇట్లనిరి. ఫలానా తెగ దానములను పర్యవేక్షించుము. కాని ప్రళయ దినమున నీ భుజమున యువ ఒంటెను మోయు పరిస్థితి రాకూడదు. అతడు ప్రళయ దినమున రోధించును. అనగా పర్యవేక్షణ హక్కును చెల్లించవలెను. న్యాయముగా వ్యవహరించవలెను. అవినీతికి పాల్పడరాదు. వారిట్లనిరి. ఈ బాధ్యతను మరొకిరికి అప్పగించండి.

ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హయాంలో ఆరుగురు అన్సార్ పవిత్ర ఖుర్‌ఆన్‌ను సమకూర్చిరి. వీరిలో ఒకరు హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ కూడ వుండిరి. అన్సార్‌లో ప్రసిద్ధి చెందిన హుఫ్ఫాజ్‌లలో హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ పేరు కూడ వున్నది.

హజ్రత్ సాద్ బిన్ ఉబాదహ్ గురించి ఇంకా కొంత సంక్షిప్త ప్రస్తావన మిగిలినది. వచ్చే ఖుత్బాలో ఆయా విషయములను ప్రస్తావింతును.

*(Summary: Office Nashr-o-Isha'at, ranslation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
|---|---|
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |